

నజర్

లోక్‌సభ అభ్యర్థుల ఖర్చుపై ఈసీ నిఘా

- నామినేషన్ దాఖలు నుంచి ఫలితాల వరకూ ప్రచార ఖర్చుల లెక్కింపు
- వివరాలను బిల్లులతో సహా అప్పగించాలి
- పరిమితి దాటితే అనర్హత వేటు..

ఎన్నికల కమిషన్ నిర్ణయించిన ధరలు	
పోడియం నిర్మాణం	రూ.150
బ్యానర్లు	రూ.6,000
మైక్‌సౌండ్	రూ.2,500
పోస్టర్లు	రూ.5,000
హోర్డింగులు	రూ.6,000
షామియానాలు	రూ.2,500
వీడియో చిత్రీకరణ	రూ.45,000
ఫంక్షన్‌హాల్ రోజుకు	రూ.20,000
కళాకారుడు రోజుకు	రూ.1,000
బెలూన్	రూ.20,000
పవర్ జనరేటర్	రూ.7,000
ఏయిర్ కూలర్	రూ.1,500
చాయి	రూ.10
స్నాక్స్	రూ.15
లెమన్ రైస్	రూ.40
డప్పులు	రూ.700
ప్రచార రథం	రూ.3,000
టెంటు సామాగ్రి	రూ.12,000
ఎల్‌ఈడీ స్క్రీన్	రూ.5,000
ఇన్నోవా వాహనం	రూ.3,500
త్రీ వీలర్లు	రూ.1,500
సుమో	రూ.3,000
వ్యాన్	రూ.7,000


మెదక్, ఏప్రిల్ 28: లోక్‌సభ ఎన్నికలకు సంబంధించి అభ్యర్థుల ప్రచార ఖర్చుపై ఎన్నికల కమిషన్ నజర్ వేసింది. అభ్యర్థులందరికీ సమాన అవకాశాలు లభించేలా చూడడానికి ఈసీ అభ్యర్థుల వ్యయ పరిమితిని రూ.95 లక్షలుగా నిర్ణయించింది. నామినేషన్ దాఖలు చేసినప్పటి నుంచి ఫలితాలు వచ్చేంత వరకు ఖర్చును ఈసీ నియమించిన పరిశీలకులు ప్రతీ పైసా ఖర్చును లెక్కిస్తారు. అభ్యర్థి తన ఎన్నికల ప్రచారం కోసం వెచ్చిస్తున్న డబ్బుకు సంబంధించిన లెక్కలను ప్రజాప్రాతినిధ్య చట్టం-1951లోని సెక్షన్ 77(1) ప్రకారం పక్కాగా నిర్వహించాలి. సభలు, సమావేశాలు, ర్యాలీలు, ప్రకటనలు, వాల్‌పోస్టర్లు, వాహనాలకు సంబంధించిన వ్యయాన్ని నమోదు చేయాలి.

నిశితమైన పరిశీలన

ఎన్నికల్లో రాజకీయ పార్టీలు విచ్చలవిడిగా డబ్బు వెదజల్లుతూ ఓటర్లను తమవైపు మరల్చుకునేందుకు శాయశక్తులా ప్రయత్నాలు చేస్తుంటాయి. ధన ప్రభావం ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేసే ప్రమాదం ఉండడంతో ఎన్నికల కమిషన్ అభ్యర్థుల ప్రచార ఖర్చులపై నియంత్రణ విధించింది. ప్రతీరోజు ఏ పార్టీ అభ్యర్థిఇ ప్రచారంలో భాగంగా ఏయే ఖర్చులు పెడుతున్నారనే దానిపై ఎప్పటికప్పుడు ఈసీ వ్యయ పరిశీలకులతో పాటు కేంద్ర, రాష్ట్ర ఎన్‌ఫోర్స్‌మెంట్ సంస్థలు, ఫ్లయింగ్ స్క్వాడ్‌లు, నిఘా బృందాలు, వీడియో బృందాలు సమాచారాన్ని సేకరిస్థాయి. అభ్యర్థుల ఖర్చులను పరిశీలించేందుకు ఆడిట్ బృందాలను ఏర్పాటు చేశారు. ఆయా పార్టీల అభ్యర్థులకు మద్దతుగా నిర్వహించే సభలతో పాటు ర్యాలీలు, రోడ్‌షోలలో ఖర్చుచేసే కుర్చీల నుంచి ఎల్‌ఈడీ స్క్రీన్లు, భోజనం, టీ, కాఫీ వరకూ అంతా పరిశీలించి లెక్కిస్తారు. ఏ అభ్యర్థి ఎంత ఖర్చు చేశారనేది ఆన్‌లైన్‌లో తెలిపేందుకు ఓ వెబ్‌సైట్‌ను నెలకొల్పనున్నట్లు సమాచారం. అయినా, అభ్యర్థుల ప్రచార ఖర్చులపై పరిమితి ఉంది కానీ.. రాజకీయ పార్టీలు ఎన్నికల కోసం ఎంత వెచ్చించాలన్న దానిపై ఆంక్షలు లేకపోవడంతో ధన ప్రవాహం ఆగడం లేదు.

ధరలకనుగుణంగా ఖర్చు

మార్కెట్‌లో ధరలు ఎప్పటికప్పుడు పెరుగుతున్న నేపథ్యంలో ఖర్చులను అంచనా వేయడానికి ధరల ద్రవ్యోల్బణ సూచీని ఎన్నికల కమిషన్ ప్రామాణికంగా తీసుకుంటుంది. ప్రస్తుతం ఈ లోక్‌సభ ఎన్నికల ప్రచార నిమిత్తం ఎన్నికల కమిషన్ వ్యయ పరిమితిని రూ. 95 లక్షల వరకు నిర్ణయించింది. అభ్యర్థి ఏదైనా జాతీయ బ్యాంకు ఖాతా తెరిచి దాని ద్వారా లావాదేవీలు నిర్వహించాలి. ఎన్నికల ఫలితాలు వెలువడిన 30 రోజుల లోపు అభ్యర్థులు తమ ఎన్నికల ఖర్చు వివరాలను బిల్లులతో సహా అధికారులకు అప్పగించాలి. లేదంటే అభ్యర్థిపై అనర్హత వేటు పడే ప్రమాదముంది.



ప్రభుత్వ ఉద్యోగులూ బీకేర్‌ఫుల్

పార్టీలకు అనుకూలంగా ఉంటే అంతేసంగతి!



సిద్దిపేట అగ్రికల్చర్, ఏప్రిల్ 28 : ఇటీవల ఓ ప్రధాన పార్టీ అభ్యర్థి నిర్వహించిన సమావేశానికి వెళ్లిన 106 మంది డీఆర్‌డీఏ శాఖ ఉద్యోగులపై ఎన్నికల అధికారి సస్పెన్షన్ వేటు వేసిన విషయం తెలిసిందే. ఎన్నికల ప్రవర్తనా నియమావళిని ఉల్లంఘించి ఒక పార్టీ అభ్యర్థికి మద్దతుగా సమావేశానికి వెళ్లిన తీరుపై ఎన్నికల సంఘం కన్నెర్ర చేసింది. ఇతర పార్టీలు ఇచ్చిన ఫిర్యాదుతో రంగంలోకి దిగిన నిఘా విభాగం అధికారులు సమావేశంలో పాల్గొన్న ఒక్కొక్కరి వివరాలు, హోదాల్ని సేకరించి విధులకు దూరంగా ఉండాలని ఉత్తర్వులు జారీ చేశారు. లోక్‌సభ ఎన్నికల వేళ ఈ సంఘటన రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం సృష్టించింది. దీంతో రాష్ట్ర, కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాలతో జిల్లాలో సర్వేలెన్స్ బృందాలు ఉద్యోగులపై ప్రత్యేకంగా దృష్టి పెట్టాయి. జిల్లాలో ప్రభుత్వ ఉద్యోగులు, కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ సేవల ఉద్యోగులు సుమారు 16 వేల మంది వరకు ఉంటారు. వీరు ఏ పార్టీకి మద్దతుగా నిలిచినా నిబంధనల మేరకు చర్యలు తప్పవు.

జాగ్రత్తగా ఉండాల్సిందే

ప్రభుత్వ ఉద్యోగులు రాజకీయ పార్టీలకు ప్రచారం చేయరాదనే నిబంధనలు 1949 సెప్టెంబరు 17వ తేదీ నుంచి అమలులోకి వచ్చాయి. సెక్షన్ 23 (ఐ) ప్రకారం వారంతా ఎన్నికల కోడ్ పరిధిలోకి వస్తారు. ప్రభుత్వ ఉద్యోగులతోపాటు వివిధ కార్పొరేషన్, ప్రభుత్వ రంగ సంస్థల్లో పనిచేసే అన్ని స్థాయిలు, కేటగిరీల ఉద్యోగులు పారదర్శకంగా వ్యవహరించాలి. ఎన్నికలు సజావుగా నిర్వహించేందుకు ప్రతి అధికారి ఉద్యోగి తనవంతు బాధ్యతను సక్రమంగా నిర్వర్తించాలి. ఎలాంటి పక్షపాతాన్ని చూపించకూడదు. ప్రభుత్వం అందించిన ఉద్యోగ బాధ్యతతో అందరి మన్ననల్ని పొందే విధంగా పని తీరులో ప్రత్యేకతను చూపించాలి.

ఇలా చేసినా తప్పే..

- సోషల్ మీడియాల్లో పోస్టులను చూసి ఒక పార్టీకి అనుకూలంగా ప్రభుత్వ ఉద్యోగి కామెంట్ పెట్టినా చర్యలుంటాయి
- ప్రత్యక్షంగా కానీ పరోక్షంగా కానీ ఏ అభ్యర్థికైనా సహకరిస్తున్నారనే చిన్నపాటి ఆధారాలు దొరికినా వేటు పడుతుంది
- ముఖ్యంగా ప్రచార సభల్లో పాల్గొనడం, లోలోపల తమ కులం నేత అని ప్రచారం చేయడాన్ని కూడా తీవ్రంగా పరిగణిస్తారు
- వారి సొంత ఊళ్లలోనూ కండువాలు వేసుకుని ప్రచారం చేయడం లేదా.. రెచ్చగొట్టే విధంగా మాట్లాడటం లాంటివి చేయొద్దు
- తన కిందిస్థాయి సిబ్బందికి అధికార దర్పంతో ఒక పార్టీకి సహకరించాలని, ఫలానా వాళ్లకు ఓటెయ్యాలని చెప్పకూడదు

ఎన్నికల విధుల్లో అలసత్వం వద్దు

- ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరగాలి
- సమీక్ష సమావేశంలో జిల్లా సాధారణ ఎన్నికల పరిశీలకుడు సమీర్‌మాధవ్ కుర్కోటి
- మెదక్ పార్లమెంట్ ఎన్నికల అధికారి, మూడు జిల్లాల ఎస్పీలు హాజరు



సమావేశంలో మాట్లాడుతున్న సమీర్‌మాధవ్ కుర్కోటి

మెదక్ అర్బన్, ఏప్రిల్ 28: ఎన్నికల విధుల్లో అలసత్వం వద్దని, ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిగేలా చూడాలని అధికారులకు జిల్లా సాధారణ ఎన్నికల పరిశీలకుడు సమీర్‌మాధవ్ కుర్కోటి సూచించారు. ఆదివారం మెదక్ కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రాహుల్ రాజ్, ఎస్పీ బాలస్వామిలతో కలిసి ఎన్నికల ఏర్పాట్లపై సమీక్షించారు. జిల్లాలోని పోలింగ్ కేంద్రాలు, ఓటర్ల సంఖ్య, పోటీ చేసే అభ్యర్థులు, ఈవీఎం, వీవీప్యాట్లు, పోస్టల్ బ్యాలెట్లు, ఎన్నికల వస్తు సామగ్రి, సీజ్ చేసిన మద్యం, నగదు, సువిధా యాప్‌లో వచ్చిన అనుమతుల వివరాలు, కార్యక్రమాలపై వివరించారు. అనంతరం సమీర్‌మాధవ్‌కుర్కోటి మాట్లాడుతూ.. ఎన్నికల నిబంధనల మేరకు అన్ని శాఖల సిబ్బంది సమన్వయంతో పని చేయాలని సూచించారు. ప్రతీ ఓటరుకు పోల్‌చీటీలు అందేలా కార్యాచరణ అమలు చేయాలన్నారు. పంపిణీలో ఫిర్యాదులుంటే పరిష్కారానికి నోడల్ అధికారులను నియమించాలని ఆదేశించారు. జిల్లా వ్యయ పరిశీలకుడు సునీల్‌కుమార్ రాజ్వాన్షి మాట్లాడుతూ.. పోటీలో ఉన్న అభ్యర్థులు ఈసీ అనుమతితోనే ప్రచార సామగ్రిని రవాణా చేయాలని సూచించారు. అధికారులు అభ్యర్థి ఖర్చును నమోదు చేయాలని, వీడియో కెమెరాలో రికార్డ్ చేయాలని సూచించారు. ఓటర్లకు ఎలాంటి సమస్య రాకుండా చూడాలని సూచించారు. జిల్లా పోలీస్ పరిశీలకుడు రామేశ్వర్‌సింగ్ మాట్లాడుతూ.. ఎన్నికల నిర్వహణలో పోలీసుల పాత్ర గొప్పదని, విధులు సమవర్థవంతంగా నిర్వహించాలని సూచించారు. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల్లో భద్రత పెంచాలని ఆదేశించారు. ఈ సమావేశంలో సిద్దిపేట, సంగారెడ్డి జిల్లాల ఎస్పీలు అనురాధ, రూపేష్, అదనపు కలెక్టర్లు వెంకటేశ్వర్లు, శ్రీనివాస్‌రెడ్డి, గరిమా అగర్వాల్, ఎన్నికల నోడల్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



మల్లన్న ఆలయ గంగిరేగుచెట్టు ప్రాంగణంలో భక్తజనసందోహం

మల్లన్న ఆలయం భక్తజనసంద్రం

చేర్యాల, ఏప్రిల్ 28 : కొమురవెల్లి మల్లన్న ఆలయం దర్శనార్థం ఆదివారం వేలాదిమంది భక్తులు తరలిరావడంతో ఆలయ పరిసరాలు కిటకిటలాడాయి. వేసవి సెలవులు కావడంతో ఇంటిల్లిపాదిగా భక్తులు తరలిరావడంతో సందడిగా మారింది. భక్తులు మొక్కుబడి తలనీలాలు సమర్పించి ఆలయ కోనేటిలో స్నానమాచరించారు. సంప్రదాయబద్ధంగా మట్టికుండలో బోనం చేసి భక్తిప్రపత్తులతో పట్నాలు వేసి మొక్కులు తీర్చుకున్నారు. మల్లన్నను దర్శించుకుని ఒడిబియ్యాలు పోసి వేడుకున్నారు. ఎల్లమ్మదేవతకు బోనం నివేదించి, కల్లు, బెల్లంపానకం సాకపెట్టి ఒడిబియ్యాలు పోశారు. ప్రత్యేక, ఉచిత ధర్మదర్శనం క్యూలైన్లల్లో రద్దీ కొనసాగడంతో స్వామివారి దర్శనానికి గంటన్నర సమయం పట్టింది. అలాగే పట్నాలు వేసిన భక్తులతో ముఖమండపం, గంగిరే గుచెట్టు ఆలయ ప్రాంగణాలు సందడిగా మారాయి. తమ కోరికలు నెరవేర్చమని వేడకుంటూ ఆలయ ప్రాంగణంలోని గంగిరేగు చెట్టుకు భక్తులు ముడుపులు కట్టారు. ఈవో బాలాజీశర్మ ఆధ్వర్యంలో ఏఈవో బుద్ధి శ్రీనివాస్ తదితరులు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

చలువ చేసే తాటిముంజలు



అక్కన్నపేటలో అమ్ముతున్న తాటిముంజలు





అక్కన్నపేట, ఏప్రిల్ 28 : వేసవిలో మాత్రమే లభించే ప్రకృతి వరప్రసాదం తాటి ముంజలు.. ఎండాకాలం వచ్చిందంటే తాటి ముంజల కోసం అందరూ ఎదురుచూస్తూ ఉంటారు. ఎండలు పెరుగుతూ చుక్కలు చూపిస్తుండగా, వీటి నుంచి ఉపశమనం పొందేందుకు ప్రస్తుతం అందుబాటులోకి వచ్చాయి. సిద్దిపేట జిల్లా అక్కన్నపేట, హుస్నాబాద్ మండలాల్లో తాటి ముంజలను ప్రధాన రహదారి పక్కనే అమ్ముతున్నారు. ఒంటికి చలువ చేసే ముంజలను తినేందుకు ప్రజలు ఆసక్తి కనబరుస్తున్నారు.

రాష్ట్ర ప్రభుత్వం నూతన ఇసుక పాలసీ తీసుకొస్తామని హామీ ఇచ్చినా కార్యరూపం దాల్చకపోవడంతో గ్రామాల్లో అవసరాలకు అవస్థలు తప్పడంలేదు. ఇళ్లు కట్టుకుందామనుకున్నా.. వర్షాకాలం రాకముందే పాతింటికి మరమ్మతులు చేసుకుందామనుకున్నా ట్రాక్టర్ ఇసుక ట్రిప్పునకు నానా తంటాలు పడాల్సివస్తోంది. గత్యంతరం లేక ఎడ్లబండ్లను ఆశ్రయిస్తున్నారు. దీంతో బాడిగ బండ్లకు భలే గిరాకీ ఏర్పడింది.

- దుబ్బాక, ఏప్రిల్ 28

బాడిగ బండ్లకు భలే గిరాకీ

- ఎడ్లబండ్లలో తరలిస్తున్న ఇసుక
- ప్రభుత్వం ఇంకా ప్రకటించని ఇసుక పాలసీ
- స్థానిక అవసరాల అనుమతులపై రాని స్పష్టత
- గత్యంతరం లేక ఎడ్లబండ్లను ఆశ్రయిస్తున్న కూడవెల్లి వాగు పరీవాహక ప్రజలు



దుబ్బాక మండలం కూడవెల్లి వాగు పరిసర ప్రాంతాల్లో బాడిగ బండ్లు(అద్దెకు ఇచ్చే ఎడ్లబండ్లు) దర్శనమిస్తున్నాయి. దుబ్బాక మండలం ఆకారం, అక్బర్‌పేట-భూంపల్లి మండలాలల్లో ఎడ్లబండ్లకు భలే గిరాకీ ఏర్పడింది. ట్రాక్టర్లు, టిప్పర్లు, లారీలలో ఇసుక తెచ్చుకుంటే అనుమతుల పేరుతో ఆంక్షలు ఉండటంతో ఎడ్లబండ్లే దిక్కయ్యాయి. ఇంటిసూరు కప్పించుకోవడం, ఇళ్ల మరమ్మతులు, చిన్నచిన్న నిర్మాణాలకు కూడవెల్లి వాగు పరిసర ప్రాంతాల ప్రజలు ఇసుక తెచ్చుకోవడానికి ఎలాంటి అనుమతులు అవసరం లేని బాడిగ బండ్లనే ఆశ్రయిస్తున్నారు. ఎడ్లబండ్లు కనుమరుగవుతున్న కాలంలో ప్రస్తుతం ఇసుకకు బాడిగ బండి అవసరం రావడంతో మళ్లీ ఎనకటి కాలం వచ్చిందా.. అంటూ ప్రజలు అనుకుంటున్నారు. ప్రతీరోజు ఉదయం పూట మూడు ట్రిప్పులు, సాయంత్రం పూట మూడు ట్రిప్పుల ఇసుకను తరలిస్తూ బాడిగ బండ్ల వారు జీవనం సాగిస్తున్నారు. ఎడ్లబండి ట్రిప్పుకు రూ.1200 వరకు పలుకుతుంది. బాడిగ బండి వెంట ఇద్దరు కూలీలను కూడా సమకూర్చుకుని వారికి రోజు వెయ్యి రూపాయల వరకు ఇస్తున్నారు. మూడు నాలుగు కిలోమీటర్ల పరిధిలోని వారికి ఇసుకను చేరవేస్తున్నారు.

స్థానిక అవసరాలకు అనుమతెప్పుడో..?

రాష్ట్ర ప్రభ్వుత్వం ఇసుక అక్రమ రవాణాను కట్టడి చేయడానికి నూతన ఇసుక పాలసీని రూపొందించనున్నట్లు ప్రకటించగా, స్థానిక అవసరాలకు తహసీల్దార్ అనుమతితో వినియోగించుకోవచ్చని తెలిపారు. ప్రస్తుతానికి క్వారీలలో మాత్రమే ఇసుక అనుమతులను సులభతరం చేశారు. అయితే, తమకు ఇప్పటివరకు ఎలాంటి విధివిధానాలు రాలేవని తహసీల్దార్లు చేతులెత్తేస్తున్నారు. దీంతో పేదలు దళారులను ఆశ్రయించాల్సి వస్తోంది. ఎక్కువ మొత్తం చెల్లించి క్వారీల నుంచి ఇసుకను తెప్పించుకోవాల్సి వస్తుంది. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడినప్పుడు ఇసుక ధర టన్నుకు రూ.1800 నుంచి రూ.2200 వరకు బ్లాక్‌లో అమ్మారు. ప్రస్తుతం క్వారీలలో టన్నుకు రూ.1,450కి తగ్గింది. అయితే సిద్దిపేట జిల్లాకు రెండువందల కిలో మీటర్ల దూరంలో ఉన్న గోదావరి నది కాళేశ్వరం పరిసర ప్రాంతాల నుంచి ఇసుకను తెప్పించుకోవాలంటే ఇబ్బందిగా మారింది. ప్రభుత్వం 16 టైర్ వాహనాల్లో 36 టన్నులు, 14 టైర్‌ల వాహనంలో 32 టన్నులు, 12 టైర్‌ల వాహనంలో 28 టన్నులకు మాత్రమే అనుమతినివ్వడంతో రవాణా భారం కూడా ఏర్పడుతుంది. దీంతో పేదలు ఇసుకను కొనే స్థోమత లేక ఇళ్ల నిర్మాణం చేపట్టడంలేదు. స్థానిక అవసరాలకు, స్థానిక వనరులను వినియోగించుకునే అవకాశం కల్పించాలని కోరుతున్నారు





కాంగ్రెస్ అధికారంలోకి రాగానే కరెంట్ కష్టాలు

- బీఆర్‌ఎస్‌ను ఆశీర్వదిస్తే ప్రజల కోసం పోరాడుతాం
- రోడ్‌షోలో మాజీ మంత్రి హరీశ్‌రావు

7

సీఎం రేవంత్‌రెడ్డి, మాజీ సీఎం కేసీఆర్ అవిభక్త కవలలు

- కాంగ్రెస్ పాలనలో ఎన్నిసార్లు రాజ్యాంగ సవరణ చేశారో చర్చకు సిద్ధమా : రఘునందన్‌రావు

7

భార్య పుట్టింటికి వెళ్లిందని భర్త ఆత్మహత్య

శివ్వంపేట, ఏప్రిల్ 28: భార్య పుట్టింటికి వెళ్లి రావడం లేదన్న మనస్తాపంతో భర్త ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మండలంలోని గుండ్లపల్లి గ్రామానికి చెందిన డప్పు కుమార్(37) మనోహరాబాద్‌కు చెందిన అనితను 15 ఏళ్ల క్రితం వివాహం చేసుకున్నాడు. నాలుగురోజుల క్రితం భార్యాభర్తల మధ్య గొడవ జరగడంతో అనిత పుట్టింటికి వెళ్లింది. దీంతో మనస్తాపం చెందిన కుమార్ శనివారం రాత్రి ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఆదివారం ఉదయం లేవకపోవడంతో కుటుంబసభ్యులు తలుపు ధ్వంసం చేసి గదిలో చూడగా ఉరేసుకుని మృతిచెంది ఉన్నాడు.

సంగారెడ్డిలో అంబలి కేంద్రం ఏర్పాటు

సంగారెడ్డి రూరల్, ఏప్రిల్ 28: అయ్యప్ప ఆపద్బాంధవ సేవా సమితి ఆధ్వర్యంలో సంగారెడ్డి పట్టణ పోలీస్‌స్టేషన్ ఎదుట ఆదివారం అంబలి కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సేవా సమితి అధ్యక్షుడు సత్యనారాయణ మాట్లాడుతూ వేసవిలో పాదచారుల దాహార్తిని తీర్చి చల్లదనాన్ని అందించాలనే ఉద్దేశంతో అంబలిని వితరణ చేస్తున్నామన్నారు. ప్రతిరోజు వెయ్యి నుంచి 1500 మందికి అంబలిని పంపిణీ చేస్తున్నామని తెలిపారు. సమితి సభ్యులు నరేష్‌కుమార్, రాధాకృష్ణ, మాణిక్‌రెడ్డి పాల్గొన్నారు.

మహాత్మా జ్యోతిబాపూలే ప్రవేశ పరీక్ష ప్రశాంతం


సంగారెడ్డిలోని ఓ పరీక్షా కేంద్రంలో తనిఖీ చేస్తున్న ఆర్‌సీవో ప్రభాకర్

సంగారెడ్డి అర్బన్, ఏప్రిల్ 28: మహాత్మా జ్యోతిబాపూలే రెసిడెన్షియల్ సొసైటీలో ఇంటర్మీడియట్, డిగ్రీ ఫస్టియర్‌లో ప్రవేశాల కోసం ఆదివారం నిర్వహించిన ప్రవేశ పరీక్ష ప్రశాంతంగా జరిగింది. సంగారెడ్డి జిల్లాలోని 11 కేంద్రాల్లో జరిగిన ఇంటర్మీడియట్, డిగ్రీ ప్రవేశ పరీక్షకు 2,957 మందికి, 2,514 మంది హాజరుకాగా, 443 మంది గైర్హాజరయ్యారు. మెదక్ జిల్లాలో ఏడు కేంద్రాల్లో 1,973 మందికి 1,774 మంది హాజరుకాగా, 199 మంది గైర్హాజరయ్యారు. సిద్దిపేట జిల్లాలోని ఏడు పరీక్షా కేంద్రాల్లో 1,632 మంది విద్యార్థులకుగాను 1,434 మంది హాజరుకాగా 198 మంది గైర్హాజరయ్యారు. ఉదయం 10 గంటల నుంచి 12.30 గంటల వరకు ప్రవేశ పరీక్ష జరిగింది. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా అన్ని కేంద్రాల్లో ప్రవేశ పరీక్ష ప్రశాంతంగా ముగిసిందని రీజినల్ కో ఆర్డినేటర్(ఆర్‌సీవో) ప్రభాకర్ తెలిపారు.

కాంగ్రెస్ అధికారంలోకి రాగానే కరెంట్ కష్టాలు

- ఆరు గ్యారెంటీల అమలులో కాంగ్రెస్ విఫలం
- బీఆర్ఎస్‌ను ఆశీర్వదిస్తే ప్రజల కోసం పోరాడుతాం
- రోడ్‌షోలో మాజీ మంత్రి హరీశ్‌రావు


చిన్నశంకరంపేట: రోడ్‌షోలో మాట్లాడుతున్న హరీశ్‌రావు


వెల్దుర్తి: ప్రజలకు అభివాదం చేస్తున్న వెంకట్రామారెడ్డి

చిన్నశంకరంపేట, ఏప్రిల్ 28: కాంగ్రెస్ అధికారంలోకి రాగానే కరెంట్ కష్టాలతో రైతులు కటకటాల పాలయ్యారని మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆదివారం బీఆర్ఎస్ అభ్యర్థి వెంకట్రామారెడ్డికి మద్దతుగా మెదక్ జిల్లా చిన్నశంకరంపేట మండల కేంద్రంలోని అమరవీరుల స్తూపానికి నివాళులర్పించి బస్టాండ్ వరకు రోడ్ షో నిర్వహించారు. ఈ సందర్భంగా హరీశ్‌రావు మాట్లాడుతూ కాంగ్రెస్ ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను మరిచి మోసం చేసిందన్నారు. కరెంట్ కష్టాలతో రైతులు పంటలు పండించలేకపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వంలో రైతులకు అన్నివిధాలుగా మేలు జరిగిందని పేర్కొన్నారు. ప్రజలకు మంచిరోజులు రావాలంటే బీఆర్ఎస్ అభ్యర్థి వెంకట్రామారెడ్డిని గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు పట్లూరి రాజు, జడ్పీటీసీ మాధవి, వైస్ ఎంపీపీ సత్యనారాయణగౌడ్, ఎంపీటీసీలు, మాజీ సర్పంచులు పాల్గొన్నారు.

ఎన్నికల్లో కాంగ్రెస్‌కు బుద్ధి చెప్పాలి

వెల్దుర్తి, ఏప్రిల్ 28: ఆరు గ్యారెంటీల పేరుతో ప్రజలను మోసం చేసిన కాంగ్రెస్‌కు లోక్‌సభ ఎన్నికల్లో బుద్ధి చెప్పాలని మాజీ మంత్రి హరీశ్‌రావు అన్నారు. ఆదివారం మండల కేంద్రమైన వెల్దుర్తిలో భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం బస్టాండ్ వద్ద ఏర్పాటుచేసిన సమావేశంలో హరీశ్‌రావు మాట్లాడారు. గెలిచిన వందరోజుల్లో ఆరు గ్యారెంటీలను అమలు చేస్తామని మాయమాటలు చెప్పి ప్రజలను మోసం చేసిన ఘనత సీఎం రేవంత్‌రెడ్డికే దక్కుతుందన్నారు. వెంకట్రామారెడ్డి 11 ఏళ్లపాటు ఉమ్మడి జిల్లాలో పనిచేశారని, ఆయనను గెలిపిస్తే మనకు సేవచేసేందుకు సిద్ధంగా ఉన్నాడన్నారు. లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ, కాంగ్రెస్‌ను చిత్తుగా ఓడించాలని హరీశ్‌రావు పిలుపునిచ్చారు. దేశంలో 10 ఏళ్ల అధికారంలో ఉన్న బీజేపీ ప్రజలకు చేసిందేమీ లేదన్నారు. అనంతరం బీఆర్ఎస్ అభ్యర్థి వెంకట్రామారెడ్డి మాట్లాడుతూ తనకు ఉమ్మడి జిల్లాలో 11 ఏళ్లపాటు కలెక్టర్‌గా పనిచేసిన అనుభవం ఉన్నదన్నారు. తనను ఆశీర్వదించి ఎంపీగా గెలిపిస్తే పేదలకు సేవచేసేందుకు సిద్ధంగా ఉన్నానని స్పష్టం చేశారు. నర్సాపూర్ ఎమ్మెల్యే సునితారెడ్డి మాట్లాడుతూ బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి వెంకట్రామారెడ్డిని ఆశీర్వదించి భారీ మెజారిటీతో గెలిపించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో నర్సాపూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి, ఎమ్మెల్సీ యాదవరెడ్డి, వెల్దుర్తి, మాసాయిపేట మండల పార్టీ అధ్యక్షులు భూపాల్‌రెడ్డి, మధుసూదన్‌రెడ్డి, జడ్పీటీసీ రమేష్ గౌడ్, వెల్దుర్తి ఎంపీటీసీ మోహన్‌రెడ్డి పాల్గొన్నారు.

ఆరు గ్యారెంటీలు అమలు చేస్తే రాజీనామా చేస్తా

శివ్వంపేట, ఏప్రిల్ 28: ఆగస్టు 15 వరకు ఆరు గ్యారెంటీలను అమలు చేస్తే ఎమ్మెల్యే పదవికి తాను రాజీనామా చేస్తానని మాజీ మంత్రి హరీశ్‌రావు సీఎం రేవంత్‌రెడ్డికి సవాల్ విసిరారు. ఆదివారం శివ్వంపేటలో బీఆర్ఎస్ మెదక్ అభ్యర్థి వెంకట్రామారెడ్డికి మద్దతుగా నిర్వహించిన రోడ్‌షోలో ఆయన మాట్లాడారు.

ఉద్యమ గడ్డలో ఎగిరేది గులాబీ జెండానే: ఎమ్మెల్యే

దుబ్బాక/అక్బర్‌పేట-భూంపల్లి, ఏప్రిల్ 28: మెతుకు సీమ తెలంగాణ ఉద్యమ గడ్డ అని, ఇక్కడ ఎగిరేది గులాబీ జెండానే అని దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. ఆదివారం అక్బర్‌పేట-భూంపల్లి మండల కేంద్రంలో జరిగిన బీఆర్ఎస్ సోషల్ మీడియా వారియర్స్ సమావేశంలో బీఆర్ఎస్ పార్లమెంట్ అభ్యర్థి వెంకట్రామారెడ్డితో కలిసి పాల్గొన్నారు. బీఆర్ఎస్‌పై జరుగుతున్న కుట్రలను, విష ప్రచారాలను ఎప్పటికప్పుడు తిప్పికొడుతున్న సోషల్‌మీడియా సైనికుల పాత్ర గొప్పదన్నారు. తాము మల్లన్నసాగర్‌తో నీళ్లందిస్తే, కాళ్లు అడ్డంపెట్టి రైతాంగానికి కాంగ్రెస్ కన్నీళ్లు తెప్పిస్తున్నదన్నారు. కేసీఆర్‌ను బద్నాం చేసేందుకు కాళేశ్వరం నీళ్లన్నీ కిందికి వదిలారని, మూడేళ్ల కరువును ఎదుర్కొనే స్టోరేజీ ప్రాజెక్టులను కడితే, చుక్కనీరు లేకుండా చేశారన్నారు.

సీఎం రేవంత్‌రెడ్డి, మాజీ సీఎం కేసీఆర్ అవిభక్త కవలలు

- కాంగ్రెస్ పార్టీయే రాజ్యాంగ సవరణ చేసింది
- సర్జికల్ స్ట్రైక్ అంటూ తప్పుడు ప్రచారం
- ఎన్నిసార్లు సవరణ చేశారో తాను చర్చకు సిద్ధమంటూ రఘునందన్‌రావు సవాల్


మెదక్ జిల్లా పార్టీ కార్యాలయంలో మీడియా సమావేశంలో మాట్లాడుతున్న బీజేపీ మెదక్ పార్లమెంట్ అభ్యర్థి రఘునందన్‌రావు

మెదక్ అర్బన్, ఏప్రిల్ 28: సీఎం రేవంత్‌రెడ్డి. మాజీ సీఎం కేసీఆర్ వేర్వేరు కాదని, వారిద్దరు వీణావాణిలాగా అవిభక్త కవలలని బీజేపీ మెదక్ పార్లమెంట్ అభ్యర్థి రఘునందన్‌రావు అభివర్ణించారు. ఆదివారం మెదక్‌లోని పార్టీ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. తాజా, మాజీ సీఎంలపై నిప్పులు చెరిగారు. కేసీఆర్ తీసుకొచ్చిన జీవో 51ని రద్దు చేయాలని రేవంత్‌రెడ్డిని డిమాండ్ చేశారు. భారత రాజ్యాంగ నిర్మాత డా.బీఆర్ అంబేద్కర్ మళ్లీ పుట్టినా రాజ్యాంగాన్ని మార్చడం సాధ్యం కాదని స్వయంగా ప్రధాని మోదీ చెప్పిన విషయాన్ని ఆయన గుర్తుచేశారు. రాజ్యాంగాన్ని సవరణ మాత్రమే చేస్తారని, కాంగ్రెస్ పాలనలో ఇప్పటివరకు 106 సార్లు సవరణలు జరిగాయని తెలిపారు. రాజ్యాంగం మార్చేందుకు బీజేపీ సర్జికల్ స్ట్రైక్ చేసే కుట్ర చేస్తోందని, 400 సీట్లు వస్తే మోదీ మారుస్తారని సీఎం రేవంత్ తప్పుడు ప్రచారం చేస్తున్నారని, పదేళ్లుగా మోదీ అధికారంలో ఉన్నారని, ఆ సమయంలో రాజ్యాంగాన్ని రద్దు చేయలేదని ఈ సందర్భంగా గుర్తుచేశారు. అయితే ఎన్నిసార్లు సవరణ చేశారో తాను చర్చకు సిద్ధమని, మీరు సిద్ధమా? అంటూ కాంగ్రెస్, బీఆర్ఎస్ నేతలకు రఘునందన్‌రావు సవాల్ విసిరారు. బీఆర్ అంబేద్కర్‌ను ఓడించింది కాంగ్రెస్ కాదా.. అని ప్రశ్నించారు. ఆయనకు భారతరత్న ఇవ్వాలన్న కనీస జ్ఞానం కూడా లేని పార్టీ కాంగ్రెస్ అంటూ మండిపడ్డారు. జైశ్రీరాం అంటే ఏమైనా తప్పా.. జై కేసీఆర్ అనమని చెబుతావా? అంటూ బీఆర్ఎస్ అధినేతపై రఘునందన్‌రావు తనదైన శైలిలో ఆగ్రహం వ్యక్తం చేశారు. బీఆర్ఎస్‌లో అయ్యా, కొడుకులు జైశ్రీరాం అంటే కడుపు నిండుతుందా..? అని అంటున్నారని, ఇదే మాట ముస్లిం, ఆదివారం ప్రార్థనా మందిరాల వద్ద చెప్పగలరా? అని ప్రశ్నించారు. జైశ్రీరాం అంటేనే కేసీఆర్, కేటీఆర్‌ను గ్రామాల్లో తిరగనిస్తామని ఆయన హెచ్చరించారు. సోనియా, రాహుల్‌గాంధీని ఈడీ అరెస్ట్ చేయలేదంటే.. బీజేపీ, కాంగ్రెస్ ఒక్కటేనా? అని రేవంత్, కేసీఆర్‌లను సూటిగా ప్రశ్నించారు. బీజేపీ వస్తే రిజర్వేషన్లు పోలేదు.. వచ్చాయన్నారు. 370 ఆర్టికల్‌ను రద్దు చేశామని, ఓబీసీలకు రిజర్వేషన్లు కల్పించిన ఘనత మోదీ సర్కార్‌దేనన్నారు. సబ్‌కా సాత్ సబ్ కా వికాస్ ప్రధాని మోదీ నినాదమని.. రాష్ట్రంలో బీజేపీ 17 స్థానాల్లో విజయం సాధిస్తుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్, పార్లమెంట్ ఇన్‌చార్జి లక్ష్మీనర్సయ్య, మురళీయాదవ్, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎంఎల్‌ఎన్‌రెడ్డి, అసెంబ్లీ కన్వీనర్ మధు, పట్టణ అధ్యక్షుడు ప్రసాద్, జిల్లా నాయకులు తదితరులు పాల్గొన్నారు.

బీర్ల కోసం వైన్స్ వద్ద గొడవ

- అడ్డుకున్న పోలీసులకు గాయాలు
- పోలీసుల అదుపులో ఒకరు, పరారీలో మరికొందరు
- మెట్టు వద్ద ఘటన


తొగుట మండలం మెట్టు వైన్స్ వద్ద పోలీసులతో గొడవ పడుతున్న యువకులు

తొగుట, ఏప్రిల్ 28: బీర్లు కావాలంటూ యువకులు వైన్స్ వద్ద గొడవ చేయగా అడ్డుకున్న పోలీసులకు గాయాలైన సంఘటన తొగుట మండలం బండారుపల్లి గ్రామపంచాయతీ పరిధిలోని మెట్టు వైన్స్ వద్ద ఆదివారం సాయంత్రం జరిగింది. తొగుట పోలీసుల కథనం ప్రకారం... తొగుట మండలం ఘనపూర్ గ్రామంలో గ్రామదేవత ఉత్సవాలు జరుగుతుండగా పండుగకు వచ్చిన కొందరు గ్రామ సమీపంలో ఉన్న మెట్టు వైన్స్ వద్దకు చేరుకుని బీర్లు కావాలంటూ వైన్స్ సిబ్బందితో వాగ్వాదానికి దిగారు. బీర్లు లేవు.. అయిపోయాయని చెప్పినా వినిపించుకోక వైన్స్ సిబ్బందితో గొడవకు దిగారు. దాంతో వారు తొగుట పోలీసులకు సమాచారం అందించడంతో వారు అక్కడికి చేరుకుని గలాట చేస్తున్న యువకులకు నచ్చజెప్పే ప్రయత్నం చేశారు. అయినా వారు మద్యం మత్తులో ఎక్సైజ్ పోలీసులు రాక మీరెందుకొచ్చారంటూ పోలీసులపై దాడికి దిగి గాయపర్చడంతో ఒక కానిస్టేబుల్‌కు గాయాలయ్యాయి. దాంతో పోలీసులు అప్రమత్తమై గొడవ చేసి గాయపర్చిన వ్యక్తుల్లో ఒకరనిని పట్టుకోగా.. మిగతావారు పారిపోయినట్లు తొగుట ఎస్ఐ లింగం తెలిపారు. సదరు వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు ఆయన వెల్లడించారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి


బాలరాజు(ఫైల్)

చేగుంట, ఏప్రిల్ 28: రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందాడు. ఈ సంఘటన చేగుంట మండలం కర్నాల్‌పల్లి రేణుకాఎల్లమ్మ ఆలయ ఆవరణలో ఆదివారం సాయంత్రం చోటు చేసుకున్నది. ఎస్ఐ బాలరాజ్, కుటుంబసభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన న్యాలపల్లి బాలరాజు(49) రేణుకాఎల్లమ్మ ఆలయం వద్ద నూతన ద్విచక్ర వాహనానికి పూజ చేసుకుని, ఆలయం వద్ద బంధువుల శుభ కార్యంలో పాల్గొని చేగుంటకు వస్తున్నాడు. కాగా చేగుంట నుంచి గజ్వేల్ వైపు వెళ్తున్న కారు డోరు తీయడంతో అటుగా వెళ్తున్న లారీ కిందపడి బాలరాజు అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడు తూప్రాన్ మండల శివారులోని కాఫీ కంపెనీలో సెక్యూరిటీగా పనిచేస్తున్నాడు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని, పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని తూప్రాన్ ఏరియా ఆస్పత్రికి తరలించినట్లు ఎస్ఐ తెలిపారు. మృతుడు 30 ఏళ్లుగా చేగుంట 'ఆంధ్రజ్యోతి'లో పేపర్ ఏజెంట్‌గా పనిచేస్తున్నాడు.

భవిష్యత్‌లో విశ్వవిద్యాలయంగా సుల్తాన్‌పూర్ జేఎన్టీయూ


వైస్ ఛాన్స్‌లర్ నర్సింహారెడ్డిని సన్మానిస్తున్న ప్రిన్సిపాల్ నరసింహ, అధ్యాపకులు

పుల్‌కల్, ఏప్రిల్ 28: భవిష్యత్‌లో సుల్తాన్‌పూర్ జేఎన్టీయూ ఇంజనీరింగ్ కళాశాల విశ్వవిద్యాలయంగా మారనున్నదని జేఎన్టీయూహెచ్ వైస్ ఛాన్స్‌లర్ కట్టా నర్సింహారెడ్డి వెల్లడించారు. సంగారెడ్డి జిల్లా చౌటకూర్ మండలం సుల్తాన్‌పూర్ జేఎన్టీయూ ఇంజనీరింగ్ కళాశాలలో శనివారం రాత్రి నిర్వహించిన కళాశాల వార్షికోత్సవం, క్రీడోత్సవాల ముంగిపునకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. విశ్వవిద్యాలయంగా ఏర్పాటయ్యేందుకు అవసరమైన మౌలిక వసతులు, వనరులు అందుబాటులో ఉన్నాయన్నారు. ఈ ఏడాది కొత్తగా సైబర్ సెక్యూరిటీ కోర్సును ఏర్పాటు చేశామని తెలిపారు. దూరదృష్టితో సువిశాలమైన విస్తీర్ణంలో కళాశాలను నెలకొల్పబడిందని, ఇక్కడ కళాశాలను ఏర్పాటు చేయడంలో ప్రస్తుత వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ కృషి మరువలేనిదన్నారు. వైస్ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ రాఘవేందర్‌రావు కార్యక్రమానికి స్వాగతం పలుకుతూ అకాడమిక్ నివేదికను చదివి వినిపించారు. అనంతరం వైస్ ఛాన్స్‌లర్‌ను కళాశాల సిబ్బంది సన్మానించారు. కాగా కళాశాల వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

లారీ ఢీకొని బాలుడి మృతి

- పుట్టు వెంట్రుకలు తీసిన కొద్దిసేపటికే ఘటన


ప్రణయ్(ఫైల్)

కౌడిపల్లి, ఏప్రిల్ 28: పుట్టు వెంట్రుకలు తీసిన కొద్దిసేపటికే లారీ ఢీకొని బాలుడు మృతిచెందిన సంఘటన మెదక్ జిల్లా కౌడిపల్లి మండల పరిధిలోని వెంకట్రావ్‌పేట్ గేట్ సమీపంలో ఆదివారం రాత్రి చోటు చేసుకుంది. బాలుడి కుటుంబీకులు తెలిపిన వివరాల ప్రకారం.. వెంకట్రావ్‌పేట్ గ్రామానికి చెందిన దొంతుల స్వప్న-రాములు దంపతులు గ్రామ పరిధిలోని గేట్ సమీపంలో జీవనం కొనసాగిస్తున్నారు. ఆదివారం మండలంలోని తునికి నల్ల పోచమ్మ ఆలయం వద్ద తమ నాలుగు సంవత్సరాల కుమారుడు ప్రణయ్ పుట్టు వెంట్రుకలు తీసుకొని, ఇంటికి వచ్చారు. అనంతరం తోటి పిల్లలతో ప్రణయ్ మెదక్-హైదరాబాద్ జాతీయ రహదారి పైనుంచి వెళ్తుండగా హైదరాబాద్ నుంచి మెదక్ వెళ్తున్న లారీ ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని, లారీని స్టేషన్‌కు తరలించారు.

ప్రమాదవశాత్తు నీటి కుంటలో పడి వ్యక్తి మృతి


శ్రీనివాస్(ఫైల్)

మాసాయిపేట, ఏప్రిల్ 28: ప్రమాదవశాత్తు ఓ వ్యక్తి నీటి కుంటలో పడి మృతిచెందాడు. వెల్దుర్తి ఎస్ఐ మమతగౌడ్ తెలిపిన వివరాల ప్రకారం.. మాసాయిపేట మండలం హకీంపేట గ్రామానికి చెందిన మాజీ వీఆర్ఏ లోడబోయిన శ్రీనివాస్(55) తన వ్యవసాయ పొలానికి ద్విచక్ర వాహనంపై శుక్రవారం సాయంత్రం వెళ్లాడు. కాగా ప్రమాదవశాత్తు పక్కనే ఉన్న మల్లుకుంటలో పడి ఆదివారం శవమై తేలాడు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని తూప్రాన్ ఆస్పత్రికి తరలించినట్లు ఎస్ఐ తెలిపారు.

నాన్‌వెజ్ మార్కెట్ బిల్డింగ్ ఉండేనా.. కూలేనా..?


రేకులకప్పుతో నిర్మించిన నాన్‌వెజ్‌మార్కెట్ భవనం


ఎన్నికల ప్రచారంలో అంగడిబజారు చౌరస్తా వద్ద మాట్లాడుతున్న కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి(ఫైల్)

- గతంలోని మునిసిపల్ కార్యాలయం, షాపింగ్ కాంప్లెక్స్ కూల్చివేసి నిర్మాణం
- నెలవారీ ఆదాయం కోల్పోయిన బల్దియా
- అధికారంలోకి వస్తే కూల్చివేయిస్తామని 'కొమ్మూరి' ప్రకటన

చేర్యాల, ఏప్రిల్ 28: జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి, డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి మధ్య డామినేషన్ ప్రొటోకాల్ వార్ కొనసాగుతూ నియోజకవర్గంలో భిన్న రాజకీయ పరిస్థితులు నెలకొన్న నేపథ్యంలో ప్రస్తుతం అందరి దృష్టి చేర్యాల పట్టణంలోని ఇంటిగ్రేటెడ్ నాన్ వెజ్ మార్కెట్ బిల్డింగ్‌పై మళ్లింది. ప్రజలకు ఉపయోగం లేని బిల్డింగ్‌ను కూల్చివేయిస్తామని అసెంబ్లీ ఎన్నికల ముందు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి చేసిన వ్యాఖ్యల కారణంగా ప్రస్తుతం భవనం ఉండేనా... కూలేనా అన్న చర్చ సాగుతోంది.

చేర్యాల ప్రజలకు అనువుగా చాలాఏళ్ల క్రితం అంగడిబజారులో గ్రామపంచాయతీ భవనాన్ని నిర్మించారు. ఆదాయ వనరుల కల్పన కోసం దశలవారీగా కూరగాయలు, మాంసం, ఇతరత్రా దుకాణాల ఏర్పాటుతో షాపింగ్ కాంప్లెక్స్ ఏర్పాటు చేశారు. దీంతో ప్రతినెలా సుమారు రూ.లక్ష నుంచి రూ.1.50 లక్షల ఆదాయం సమకూరుతుంది. 2018లో మునిసిపాలిటీగా మార్చడంతో పాటు మాజీ మంత్రి హరీశ్‌రావు ఇంటిగ్రేటెడ్ వెజ్ అండ్ నాన్‌వెజ్ మార్కెట్ భవన నిర్మాణానికి రూ.3 కోట్లు మంజూరు చేయించారు. కానీ భవిష్యత్ అవసరాల పరిగణించకుండా స్థానిక నేతల అనాలోచిత చర్యలతో స్థలం ఎంపిక విషయం వివాదాలకు దారితీసింది. చివరకు అంగడిబజారు స్థలాన్ని ఖరారు చేయడంతో మునిసిపల్ కార్యాలయంతో పాటు అనుబంధంగా ఉన్న షాపింగ్ కాంప్లెక్స్ దుకాణాలను నేలమట్టం చేసి.. అరకొర వసతులున్న శివారులోని హాస్టల్ బిల్డింగ్‌లోకి, కూరగాయల దుకాణాలను రైతుబజారులోకి మార్చారు. తద్వారా మునిసిపాలిటీ నెలవారీ ఆదాయం కోల్పోవడంతో పాటు అంగడిబజారు బోసిపోయి దర్శనమిస్తున్నది. శివారులో ఉండాల్సిన నాన్‌వెజ్ మార్కెట్‌ను నడిబొడ్డున నిర్వహించాల్సిన దుస్థితి నెలకొనడంతో ప్రజలు ఉసూరుమంటున్నారు. రేకుల కప్పు భవనం కోసం ఆర్‌సీసీ భవనాలను అనవసరంగా కూల్చివేశారంటూ అసహనం వ్యక్తం చేస్తున్నారు.

ప్రజోపయోగ భవనాన్ని కడతామని 'కొమ్మూరి' హామీ

ఎన్నికల ప్రచారంలో భాగంగా కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి అంగడిబజారు చౌరస్తాలో నిర్వహించిన రోడ్‌షోలో పట్టణ పరిస్థితులు, మునిసిపల్ పాలన, అభివృద్ధి విషయాలపై పలు ప్రకటనలు చేశారు. అస్తవ్యస్తంగా మారిన నాన్‌వెజ్ మార్కెట్ బిల్డింగ్ పనులపై స్పందించారు. తనను ఎమ్మెల్యేగా గెలిపించడంతో పాటు అధికారంలోకి రావడంతోనే నాన్‌వెజ్ మార్కెట్ బిల్డింగ్‌ను కూలదోయించి గతంలో మాదిరి అంగడిబజారుకు పూర్వ వైభవం తీసుకొచ్చేందుకు కృషి చేస్తానని ప్రకటించారు. అది నుంచి చేర్యాల ప్రజలు తనకు మెజారిటీ కట్టబెడతారని భావించినా.. ఓటమి చవిచూడడంతో కొమ్మూరి కొంతమేర అసంతృప్తితో మెదులుతున్నాడని పార్టీ శ్రేణులు వెలిబుచ్చుతున్నాయి. ఈ క్రమంలో ప్రజలకు అనువుగాని నాన్‌వెజ్ మార్కెట్ భవనం పనులు ఇటీవల పూర్తవగా, ఎన్నికలముందు ఇచ్చిన మాట ప్రకారం కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి కూలగొట్టిస్తాడా... ప్రోటోకాల్ విషయంలో వెనక్కి తగ్గకుండా వ్యవహరిస్తున్న ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి అడ్డుకుంటాడా అన్న విషయం చర్చనీయాంశంగా మారింది.

దారి పక్కన దుకాణాల నిర్వహణతో ఇబ్బందులు

పాత సముదాయ భవనాన్ని కూల్చివేయడంతో మాంసం దుకాణాలను ఆరుబయట నిర్వహిస్తున్నారు. వ్యర్థాలతో పాటు అస్తవ్యస్త పారిశుధ్య పనులతో అంగడిబజారు పరిసరాలు కంపు కొడుతున్నాయి. మునిసిపాలిటీకి ఇటీవల రూ.10 కోట్ల నిధులు మంజూరైన నేపథ్యంలో కార్యాలయంతో పాటు నాన్‌వెజ్ మార్కెట్ భవనం విషయంలో ఏవిధంగా స్పందిస్తారో చూడాలని పట్టణ ప్రజలు చర్చించుకుంటున్నారు.

చెక్‌పోస్ట్ వద్ద వాహనాల తనిఖీ

● గజ్వేల్ రూరల్ సీఐ మహేందర్‌రెడ్డి



అధికారులకు సూచనలు ఇస్తున్న సీఐ

ములుగు, ఏప్రిల్ 28: జిల్లా సరిహద్దు వంటిమామిడి చెక్‌పోస్ట్ వద్ద పకడ్బందీగా వాహనాలను తనిఖీ చేయాలని గజ్వేల్ రూరల్ సీఐ మహేందర్‌రెడ్డి తెలిపారు. ఆదివారం మండలంలోని వంటిమామిడి చెక్‌పోస్ట్ వద్ద వాహనాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పోలీస్ అధికారులు, జిల్లా ఎన్నికల అబ్జర్వర్లు తనిఖీ చేసే అవకాశం ఉన్నందున అప్రమత్తంగా ఉండి, విధులు నిర్వహించాలన్నారు. అక్రమంగా ఎవరైనా ఎలాంటి ఆధారాలు లేని నగదు కానీ, మద్యం ఓటర్లను ప్రలోభాలకు గురిచేసే వస్తువులను, మాదకద్రవ్యాల రవాణాను అరికట్టేందుకు పటిష్ఠమైన చర్యలు చేపట్టామని తెలిపారు. చెక్‌పోస్ట్‌లో విధులు నిర్వహించే సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని, ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేయాలని సిబ్బందికి సూచించారు. ఆయన వెంట ములుగు ఎస్ఐ విజయ్‌కుమార్‌తో పాటు సిబ్బంది తదితరులు ఉన్నారు.

హక్కులను హరించేందుకు బీఆర్ఎస్ పేరు మార్పు

● నా ఎదుగుదలను అడ్డుకోవడానికి కేసీఆర్ అడుగడుగునా యత్నించారు

● హౌజింగ్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ మడుపు భూంరెడ్డి



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

గజ్వేల్, ఏప్రిల్ 28: ఉద్యమకారుల హక్కులను హరించేందుకు మాజీ సీఎం కేసీఆర్ టీఆర్ఎస్ పార్టీ పేరును బీఆర్ఎస్‌గా మార్పు చేశారని హౌజింగ్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ మడుపు భూంరెడ్డి అన్నారు. సిద్దిపేట జిల్లా గజ్వేల్ పట్టణంలో ఆదివారం గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే తూంకుంట నర్సారెడ్డి, డీసీసీబీ చైర్మన్ చిట్టి దేవేందర్‌రెడ్డి, తెలంగాణ ఫుడ్స్ మాజీ చైర్మన్ గంగుమల్ల ఎలక్షన్‌రెడ్డి, గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మునిసిపల్ మాజీ చైర్మన్ గాడిపల్లి భాస్కర్‌తో కలసి విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా భూంరెడ్డి మాట్లాడుతూ.. ఉద్యమ సమయంలో తప్పు చేసినా ప్రజలు క్షమించారని, పరిపాలనలో తప్పు చేస్తే ఓర్చుకోరనడానికి అసెంబ్లీ ఎన్నికల ఓటమిని ఉదాహరణగా అభివర్ణించారు. ఉద్యమ కాలం నాటి టీఆర్ఎస్ ఇప్పుడు లేదని, ఉద్యమ ద్రోహులు, అవినీతిపరులతో నిండిపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజాస్వామ్యయుతంగా, మాంత్రికంగా కేసీఆర్ పార్టీని నడపలేదని, తాంత్రికంగా పార్టీని నడుపుతున్నారని విమర్శించారు. తెలంగాణ ఉద్యమానికి తన రక్తం దారపోశానని, తన ఎదుగుదలను చూసి ఓర్వలేకనే కొండపాక మండలాన్ని గజ్వేల్ నియోజకవర్గంలో కలిసేలా చేశారని ఆరోపించారు. తమ పార్టీలోని నాయకుల మధ్య విభేదాలు సృష్టించి పార్టీ నేతల మధ్య తగువు పెట్టిన కేసీఆర్ చివరకు తన అవసాన దశలో కష్టాలు కొని తెచ్చుకున్నారని చెప్పారు. తెలంగాణ ఇచ్చిన ఘనత సోనియాగాంధీ, కాంగ్రెస్ పార్టీదేనని, కాంగ్రెస్ పార్టీలో చేరడం న్యాయంగా భావించి రేవంత్‌రెడ్డి సమక్షంలో పార్టీ కండువా కప్పుకున్నట్లు స్పష్టం చేశారు. ఫుడ్స్ కమిషన్ మాజీ చైర్మన్ ఎలక్షన్‌రెడ్డి మాట్లాడుతూ.. మాటలతో మభ్యపెట్టడం కేసీఆర్‌కు వెన్నతో పెట్టిన విద్య అని, తనను గజ్వేల్ ఎమ్మెల్యేగా, మదన్‌రెడ్డిని నర్సాపూర్ ఎమ్మెల్యేగా చేస్తానని మోసం చేశారని ఆరోపించారు. డీసీసీబీ చైర్మన్ చిట్టి దేవేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. పంట రుణమాఫీ చేస్తానని పదేళ్లపాటు రైతులను మోసగించిన కేసీఆర్ చర్యలు జీర్ణించుకోలేక పోయినట్లు చెప్పారు. సీఎం రేవంత్‌రెడ్డి ఏకకాలంలో రూ.2 లక్షల రుణ మాఫీ చేస్తానని హామీ ఇవ్వడం తనకు సంతోషం కలిగించిందన్నారు. బీఆర్ఎస్ నేతలు అబద్ధాలతో కాలం వెల్లదీస్తున్నారని, రాజీనామా డ్రామాలు ఎన్నికల్లో లబ్ధి పొందడానికేనని మాజీ మంత్రిని హరీశ్‌రావును ఉద్దేశించి అన్నారు. మాజీ మున్సిపల్ చైర్మన్ గాడిపల్లి భాస్కర్ మాట్లాడుతూ.. గజ్వేల్‌లో ఆయా డిపార్ట్‌మెంట్‌లలో ఔట్‌సోర్సింగ్, కాంట్రాక్ట్ ఉద్యోగులుగా సిద్దిపేట వాళ్లు పనిచేస్తున్నారని, వారి స్థానంలో గజ్వేల్ యువతకు ఉద్యోగం కల్పించేందుకు యత్నిస్తామన్నారు. డీసీసీ అధ్యక్షుడు తూంకుంట నర్సారెడ్డి మాట్లాడుతూ.. గజ్వేల్‌లో ప్రజావసరాలకు ఉపయోగపడే పనులు చేయలేదని, తమకు కమీషన్లు వచ్చే పనులకే ప్రాధాన్యమిచ్చారని ఆరోపించారు. వారివెంట టీపీసీసీ కార్యదర్శి, న్యాయవాది సాజిద్‌బేగ్, గోపాల్‌రావు, శివరాంరెడ్డి, మండలాధ్యక్షుడు మద్దూరి మల్లారెడ్డి, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు మోహన్నగారి రాజు, పట్టణ ప్రధాన కార్యదర్శి రాములుగౌడ్, నాయకులు రమేష్‌రెడ్డి, నరేందర్, సుభాష్ చంద్రబోస్, గంగిశెట్టి రాజు, రామచంద్రాచారి, శ్రీధర్ రెడ్డి, మోచీ ప్రభాకర్, సబ్బని నరేశ్, అజహర్, ముక్తార్, మామిడి కృష్ణ, సురేశ్ తదితరులు ఉన్నారు.

అసమానతలను రూపుమాపాలి

● డీబీఎఫ్ జాతీయ కార్యదర్శి పి. శంకర్



గజ్వేల్‌లో నిర్వహించిన రౌండ్‌టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న డీబీఎఫ్ జాతీయ కార్యదర్శి శంకర్

గజ్వేల్‌టౌన్, ఏప్రిల్ 28: భారత రాజ్యాంగ స్ఫూర్తికి అనుగుణంగా జనాభా దామాషా ప్రకారం అన్ని రంగాల్లో అసమానతలు రూపుమాపడానికి సామాజిక న్యాయ ఎజెండాను అమలు చేయాలని దళిత బహుజన ఫ్రంట్ జాతీయ కార్యదర్శి పి. శంకర్ డిమాండ్ చేశారు. డీబీఎఫ్ ఆధ్వర్యంలో చేపట్టిన భారత రాజ్యాంగ ప్రచారోద్యమంలో భాగంగా ఆదివారం గజ్వేల్ అంబేడ్కర్ భవన్‌లో 'కేంద్ర ఎన్నికలు-దళితుల ఆకాంక్షల' అనే అంశాపై రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భారత రాజ్యాంగాన్ని మార్చుతామని ప్రకటిస్తూ, రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధంగా ఇడబ్ల్యుఎస్ రిజర్వేషన్లను అగ్రకులాలకు అమలు చేస్తూ, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీల హక్కులను కాలరాస్తున్న బీజేపీని ఓడించాలన్నారు. దేశవ్యాప్త ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ చట్టం చేయాలన్నారు. పదేళ్లుగా కేంద్ర బడ్జెట్‌లో దళితుల సమగ్ర అభివృద్ధికి నిధులు కేటాయించలేదని, స్కాలర్‌షిప్‌లను ఎత్తివేసేందుకు కుట్ర చేసిందన్నారు. ఈ సమావేశంలో డీబీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి దాసరి ఏగొండస్వామి, మానవ హక్కుల వేదిక నాయకులు మల్లేశం, వివిధ సంఘాల నాయకులు పి. ఎల్లయ్య, కాశిం, భాస్కర్‌చారి, సత్తయ్య, కనకప్రసాద్, రాజు, చంద్రయ్య, న్యాయవాది బత్తుల రాజు తదితరులు పాల్గొన్నారు.

బ్రహ్మోత్సవాలను జయప్రదం చేయాలి: తూంకుంట నర్సారెడ్డి

గజ్వేల్/కొండపాక, ఏప్రిల్ 28: శ్రీసీతారామ, ఉమామహేశ్వరాలయ బ్రహ్మోత్సవాలను జయప్రదం చేయాలని డీసీసీ ప్రెసిడెంట్, మాజీ ఎమ్మెల్యే తూంకుంట నర్సారెడ్డి పిలుపునిచ్చారు. గజ్వేల్ పట్టణంలోని ఆయన నివాసంలో ఆదివారం బ్రహ్మోత్సవాలకు సంబంధించిన వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. వారితో మునిసిపల్ మాజీ చైర్మన్ గాడిపల్లి భాస్కర్, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు మోహన్నగారి రాజు, పార్టీ మండల అధ్యక్షుడు మద్దూరి మల్లారెడ్డి, టీపీసీసీ కార్యదర్శి నాయిని యాదగిరి, మహేందర్‌రెడ్డి, అంజి, సతీష్‌రెడ్డి, నక్క రేగొండ, నక్క రాములు, రాజశేఖర్‌రెడ్డి, యాదగిరి ఉన్నారు. కొండపాక మండలం సిరిసినగండ్ల గ్రామంలో రేణుకా ఎల్లమ్మ ఉత్సవాలకు రావాలని డీసీసీ అధ్యక్షుడు నర్సారెడ్డికి ఆదివారం గౌడ సంఘం నాయకులు ఆహ్వానపత్రిక అందజేశారు. కార్యక్రమంలో అంబటి శ్రీనివాస్, రాజు, నర్సింలు, రమేష్ తదితరులు ఉన్నారు.

అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించండి - సీపీఐ

నారాయణఖేడ్, ఏప్రిల్ 28: అంగన్‌వాడీ టీచర్లు, ఆయాల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని సీపీఐ డివిజన్ నాయకులు చిరంజీవి, ఆనంద్, ప్రేమ్, సంజీవ్‌కుమార్, అశోక్ కోరారు. ఆదివారం ఖేడ్‌లో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. అంగన్‌వాడీ టీచర్లకు, ఆయాలకు, బీఎల్వో విధులు అప్పగించడం పట్ల పని భారం అధికమవుతుందన్నారు. అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు నిరంతరం చిన్నారులు, గర్భిణులకు సేవలు అందిస్తుంటారని, వారికి పెండింగ్ వేతనాలు వెంటనే విడుదల చేయడమే కాకుండా బీఎల్వోలుగా విధులు నిర్వహించిన కాలానికి పారితోషికం వెంటనే చెల్లించాలని కోరారు. అంగన్‌వాడీ టీచర్లకు, ఆయాలకు ఒకేసారి నెల రోజుల పాటు సెలవులు ఇవ్వాలన్నారు. లేని పక్షంలో ఆందోళన కార్యక్రమాలు చేపడతామని వారు హెచ్చరించారు.

కట్ట మైసమ్మ జాతర

జిన్నారం, ఏప్రిల్ 28: జిన్నారంలో కట్టమైసమ్మ జాతరను ఆదివారం ఘనంగా నిర్వహించారు. స్థానిక రాయుని చెరువు వద్ద గల కట్టమైసమ్మ దేవాలయం వద్ద గ్రామస్థుల ఆధ్వర్యంలో మొక్కులు చెల్లించి, ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ వెంకటేశం గౌడ్, నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, శ్రీధర్‌గౌడ్, మోహన్ పాల్గొన్నారు.

ఆలయాల్లో హరీశ్‌రావు పూజలు



సిద్దిపేట పట్టణంలోని కార్యసిద్ధి వీరాంజనేయస్వామికి పూజలు చేస్తున్న ఎమ్మెల్యే హరీశ్‌రావు

సిద్దిపేట క్రైం/సిద్దిపేటరూరల్, ఏప్రిల్ 28: సిద్దిపేట పట్టణంలోని టీచర్స్ కాలనీలో నూతనంగా ప్రతిష్ఠించిన కార్యసిద్ధి వీరాంజనేయ స్వామి (బాల ఆంజనేయస్వామి) స్వామిని ఎమ్మెల్యే హరీశ్‌రావు దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బాలాంజనేయుని ఆశీస్సులు అందరిపై ఉండాలని కోరారు. ఆదివారం సిద్దిపేట రూరల్ మండలంలోని బుస్సాపూర్ గ్రామంలోని పోచమ్మ బోనాల్లో హరీశ్‌రావు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం గ్రామస్థులతో పలు అంశాలపై చర్చించారు. మండలంలోని రావూరుకుల గ్రామంలో జరుగుతున్న ముత్యాల పోచమ్మ బోనాల ఉత్సవాల్లో హరీశ్‌రావు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల ఎంపీటీసీ సభ్యులు, మాజీ సర్పంచులు, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రెండు బోర్లు వేయించిన ఎంపీ

హుస్నాబాద్‌రూరల్, ఏప్రిల్ 28: హుస్నాబాద్ మండలం బల్లునాయక్‌తండాలో తాగునీటి ఇబ్బంది తీర్చేందుకు, ఎంపీ బండి సంజయ్ కేంద్ర ప్రభుత్వ నిధులతో రెండు బోర్లు మంజూరు చేయించారు. దాహార్తిని తీర్చడం పట్ల గ్రామస్థులు సంతోషం వ్యక్తం చేసినట్లు గిరిజన మోర్చా మండలాధ్యక్షుడు లావుడ్య రాజునాయక్ పేర్కొన్నారు. ఇరవై రోజుల క్రితం తండాలో రెండు బోర్లు వేయించగా ఆదివారం బోరుమోటర్లు బిగించి తాగునీటి ఇబ్బందులు తీర్చారని పేర్కొన్నారు. తండాలో నెలకొన్న తాగునీటి ఇబ్బందులు తీర్చిన బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, ఎంపీ బండి సంజయ్‌కి మాజీ సర్పంచ్ ఇస్లావత్ రజిత, ఇస్లావత్ కోమి, ద్వళి, రాజమ్మ తదితరులు కృతజ్ఞతలు తెలిపారు.

క్లస్టర్ ఇన్‌చార్జి ఏఈవోను నియమించాలి

చేర్యాల, ఏప్రిల్ 28: చేర్యాల మండలం కడవేరుగు క్లస్టర్ వ్యవసాయశాఖ విస్తరణాధికారిని నియమించాలని రైతుసంఘం చేర్యాల మండల కార్యదర్శి కత్తుల భాస్కర్‌రెడ్డి కోరారు. ఆదివారం చేర్యాలలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. కొన్ని నెలల క్రితం ఏఈవో సెలవుపెట్టిందని, ఆమె స్థానంలో మరొకరిని ఇన్‌చార్జిగా నియమించకపోవడంతో రైతులు ఇబ్బందులుపడుతున్నారన్నారు. ఉన్నతాధికారులు వెంటనే ఇన్‌చార్జి ఏఈవోను నియమించాలని కోరారు.

కాంగ్రెస్‌లో చేరికలు



మద్దూరు: కొమ్మూరి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరుతున్న ఎన్ఆర్ఐ నిశికాంత్‌రెడ్డి

గజ్వేల్/మద్దూరు, ఏప్రిల్ 28: గజ్వేల్ మండలం దిలాల్‌పూర్ గ్రామానికి చెందిన బీఆర్ఎస్ నాయకుడు వెంకన్నగారి వెంకట్‌రెడ్డి, పిడిచెడ్ గ్రామానికి చెందిన మాజీ వైస్ ఎంపీపీ నర్సింహ్మారెడ్డి, తాజా మాజీ సర్పంచ్ మన్నె శిల్పాఅశోక్, మాజీ సర్పంచ్ పిట్ల రాములు తమ అనుచరులు 200మందితో కలిసి ఆదివారం గజ్వేల్‌లో డీసీసీ అధ్యక్షుడు తూంకుంట నర్సారెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. మద్దూరు మండలం మర్మాముల గ్రామానికి చెందిన ఎన్ఆర్ఐ ఇప్ప నిశికాంత్‌రెడ్డి, మాజీ సర్పంచ్ వెల్డి లక్ష్మీగోపాల్‌రెడ్డి, జంగిలి భిక్షపతి, కూస భానుచందర్, పివి సాయికుమార్‌రెడ్డి జనగామ డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు.

బీఆర్ఎస్ అభ్యర్థి తరఫున ప్రచారం



సింగన్నగూడలో ప్రచారం చేస్తున్న ప్రతాప్‌రెడ్డి

ములుగు, ఏప్రిల్ 28: బీఆర్ఎస్ మెదక్ పార్లమెంట్ అభ్యర్థి వెంకట్రామారెడ్డికి మద్దతుగా ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి ఆదివారం మండలంలోని కొక్కొండ, సింగన్నగూడ గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు జహంగీర్, ఉపాధ్యక్షుడు జగదీశ్వర్‌రెడ్డి, అర్జున్‌గౌడ్, అంజన్‌గౌడ్, సర్పంచ్‌ల ఫోరం మాజీ అధ్యక్షుడు గంగిషెట్టి గణేష్‌గుప్త, తాజా మాజీ సర్పంచులు బాలకృష్ణ, గణేష్, మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్లు చంద్రశేఖర్ రెడ్డి, రాములుగౌడ్, అశోక్, నరేశ్‌తో పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

● **గజ్వేల్:** గజ్వేల్ మండలం రిమ్మనగూడలో బీఆర్ఎస్ మెదక్ ఎంపీ అభ్యర్థి వెంకట్రామారెడ్డికి మద్దతుగా బీఆర్ఎస్ నాయకులు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గజ్వేల్ జడ్పీటీసీ పంగ మల్లేశం, వైస్ ఎంపీపీ బెల్దే కృష్ణాగౌడ్, మాజీ ఏఎంసీ చైర్మన్ మాదాసు శ్రీనివాస్, మాజీ జడ్పీటీసీ బొల్లారం ఎల్లయ్యలు ఉన్నారు.

● **మర్కుక్:** మర్కుక్ మండలం దామరకుంట గ్రామంలో ఆదివారం బీఆర్ఎస్ మెదక్ అభ్యర్థి వెంకట్రామారెడ్డికి మద్దతుగా ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మర్కుక్ బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు కరుణాకర్‌రెడ్డి, ఎంపీపీ పాండుగౌడ్, జడ్పీటీసీ మంగమ్మ రాంచంద్రం, వైస్ ఎంపీపీ బాల్‌రెడ్డి, ఎంపీటీసీల ఫోరం అధ్యక్షుడు కృష్ణయాదవ్, స్థానిక మాజీ సర్పంచ్ గాయత్రి బాల్‌నర్సయ్య, కరకపట్ల తాజా మాజీ సర్పంచ్ నిర్సంహులు, ఏఎంసీ గజ్వేల్ మార్కెట్ కమిటీ తాజా మాజీ డైరెక్టర్ సత్తిబాబు, ఏఎంసీ వంటిమామిడి మాజీ డైరెక్టర్ బబ్బూరి రాందాస్‌గౌడ్, చేబర్తి తాజా మాజీ సర్పంచ్ అశోక్, మర్కుక్ మండల కోఆప్షన్ సభ్యుల సాహెరా నరేశ్, మాజీ ఉపసర్పంచ్ పత్తి అంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ అభ్యర్థికి ముదిరాజుల మద్దతు

కొండపాక, ఏప్రిల్ 28: బీఆర్ఎస్ మెదక్ పార్లమెంటు అభ్యర్థి వెంకటరామారెడ్డికి కొండపాక మండల ముదిరాజ్ సంఘం పూర్తి మద్దతు ప్రకటించింది. ఆదివారం మండలంలోని మర్పడగలో కొండపాక ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు జిర్ర రాజు అధ్యక్షతన సంఘం సమావేశం జరిగింది. ఈ సందర్భంగా బీఆర్ఎస్ అభ్యర్థికి పూర్తి మద్దతునిస్తూ ప్రకటన చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర ముదిరాజ్ మహాసభ కొట్టాల యాదగిరి, వివిధ గ్రామాలకు చెందిన ముదిరాజ్ సంఘ సభ్యులు పాల్గొన్నారు.

ప్రజాస్వామ్యంలో ప్రజల తీర్పు గొప్పది

● అభివృద్ధి పై చర్చకు సిద్ధమా

● కాంగ్రెస్ నాయకులు



మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

బెజ్జంకి, ఏప్రిల్ 28: ప్రజాస్వామ్యంలో ప్రజల తీర్పు గొప్పదని, అధికారం కోల్పోవడంతో మానకొండూర్ మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ మతిభ్రమించి మాట్లాడుతున్నారని కాంగ్రెస్ నాయకులుఅన్నారు. ఆదివారం బెజ్జంకి మండల కేంద్రంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. గెలుపోటములు సహజమని, అభివృద్ధికి సహకరించాలే తప్ప విమర్శించవద్దని హితవు పలికారు. మండలాన్ని అభివృద్ధి చేశామని గొప్పలుచెప్పుతున్న రసమయి బాలకిషన్ శిలాఫలకాలకే పరిమితమయ్యారని, ఎక్కడ అభివృద్ధి జరిగిందో చూపించాలని ప్రశ్నించారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో అక్రమాలకు పాల్పడి కబ్జాలు చేసింది బీఆర్ఎస్ నాయకులు కాదా అని, ప్రశ్నించిన దళితుల పై కేసులు పెట్టలేదా అని అడిగారు. రసమయి బాలకిషన్వి పిట్టల దొర మాటలు అని, ఆయనకు దేహశుద్ధి తప్పదని హెచ్చరించారు. కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దామోదర్, మండలాధ్యక్షుడు రత్నాకర్‌రెడ్డి, పోతిరెడ్డి రాజశేఖర్ రెడ్డి, టౌన్ ప్రెసిడెంట్ పాల్గొన్నారు.

కార్మిక వ్యతిరేక బీజేపీని ఓడించండి

● సీఐటియూ రాష్ట్ర అధ్యక్షుడు చుక్క రాములు



సమావేశంలో మాట్లాడుతున్న చుక్క రాములు

సిద్దిపేట అర్బన్, ఏప్రిల్ 28: పార్లమెంట్ ఎన్నికల్లో కార్మిక వ్యతిరేక, కార్పొరేట్ అనుకూల, మతోన్మాద బీజేపీని ఓడించాలని సీఐటియూ రాష్ట్ర అధ్యక్షుడు చుక్క రాములు కార్మికవర్గానికి పిలుపునిచ్చారు. ఆదివారం సిద్దిపేట జిల్లా సీఐటీయూ కార్యాలయంలో '2024 పార్లమెంట్ ఎన్నికలు - కార్మిక వర్గ కర్తవ్యం' అనే అంశంపై జిల్లా సెమినార్‌లో ఆయన మాట్లాడారు. కార్మిక వర్గాన్ని పూర్తిగా విస్మరించి, ప్రజావ్యతిరేక పాలన సాగిస్తున్న బీజేపీని ఓడించడానికి కార్మికులు కంకణ బద్ధులై ఉండాలని సూచించారు. పెట్టుబడిదారుల ప్రయోజనాల కోసం 29 కార్మిక చట్టాలను సవరించి నాలుగు లేబర్ కోడ్‌లను తెచ్చిందన్నారు. ఈ కోడ్ల వల్ల కార్మికులు సంఘాలు పెట్టుకునే హక్కు కోల్పోయారన్నారు. వివిధ ప్రమాదాలకు రవాణా రంగ కార్మికులను బాధ్యులుగా చేసి పది లక్షల పెనాల్టీ, రెండేళ్ల జైలు శిక్షలకు గురిచేసి హిట్ అండ్ రన్ చట్టాన్ని తెచ్చిందన్నారు. సమావేశంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి కాములు గోపాలస్వామి, జిల్లా ఉపాధ్యక్షుడు కాట మధు, జిల్లా కోశాధికారి జి.భాస్కర్, జిల్లా సహాయ కార్యదర్శి చొప్పరి రవికుమార్, జిల్లా నాయకులు ఎల్లయ్య ,లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ నాయకుల ఇంటింటి ప్రచారం



ప్రచారం చేస్తున్న బీజేపీ నాయకులు

రాయపోల్, ఏప్రిల్ 28: బీజేపీ మండల అధ్యక్షుడు రాజాగౌడ్ ఆధ్వర్యంలో మండలంలోని లింగారెడ్డిపల్లిలో ఆదివారం ప్రచారం చేశారు. కేంద్ర ప్రభుత్వం ద్వారా ప్రజలకు అందుతున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. బీజేపీకి ఓటేసి రఘునందన్‌రావును భారీ మెజార్టీతో గెలిపించి నరేంద్రమోదీకి మద్దతుగా నిలవాలని అభ్యర్థించారు. కార్యక్రమంలో బీజేపీ మండల ప్రధాన కార్యదర్శులు నీల స్వామి, కృష్ణ, నాయకులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా వీరశైవాగమ పాఠశాల వార్షిక పరీక్షలు



పరీక్షలను పర్యవేక్షిస్తున్న దేవాదాయ,ధర్మాదాయ ఆగమ సలహాదారుడు ఎం.మహంతయ్య

చేర్యాల, ఏప్రిల్ 28: కొమురవెల్లి మల్లికార్జునస్వామి దేవాలయం పరిధిలోని వీరశైవాగమ వేదపాఠశాల వార్షిక పరీక్షలు ఆదివారం ప్రశాంతంగా జరిగాయి. ఈ సందర్భంగా టీటీడీ సత్రంలో దేవాదాయ, ధర్మాదాయ ఆగమసలహాదారుడు ఎం. మహంతయ్య పర్యవేక్షణలో నిర్వహించిన పరీక్షలో 52మంది విద్యార్థులు పాల్గొన్నారు. మల్లన్న ఆలయ ఈవో బాలాజీశర్మ, ఏఈవో బుద్ది శ్రీనివాస్, స్థానాచార్యులు పడిగన్నగారి మల్లయ్య, ప్రధానార్చకుడు మహదేవుని మల్లికార్జున్, ఆగమపాఠశాల అధ్యాపకులు వీరేశలింగం పాల్గొన్నారు.

ఓట్ల కోసం దేవుళ్ల పేర్లను వాడుకుంటున్న బీజేపీ, కాంగ్రెస్‌కు బుద్ధి చెప్పాలి: సీపీఎం

చేర్యాల, ఏప్రిల్ 28: పార్లమెంటు ఎన్నికల్లో ఓట్ల కోసం దేవుళ్ల పేర్లను వాడుకుంటున్న కాంగ్రెస్, బీజేపీలకు ప్రజలు గుణపాఠం చెప్పి, పార్లమెంటులో ప్రజల గొంతును వినిపించే సీపీఎం అభ్యర్థులను గెలిపించాలని సీపీఎం కొమురవెల్లి మండల కార్యదర్శి శెట్టిపల్లి సత్తిరెడ్డి కోరారు. పార్లమెంటు ఎన్నికల ప్రచారంలో భాగంగా భువనగిరి లోక్‌సభ స్థానం సీపీఎం అభ్యర్థి జహంగీర్ తరఫున ఆదివారం కొమురవెల్లి మండలం మర్రిముచ్చాల గ్రామంలో ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు సురేందర్‌రెడ్డి, బాలరాజు, రాంరెడ్డి, దుర్గయ్య, చంద్రారెడ్డి, ఎల్లారెడ్డి, సత్తయ్య పాల్గొన్నారు.

సివిల్స్ ర్యాంకర్ అర్పితకు సన్మానం



నర్సంపల్లిలో కోలా అర్పితను సన్మానిస్తున్న దృశ్యం

తూప్రాన్, ఏప్రిల్ 28: మెదక్ జిల్లా తూప్రాన్ మండలం నర్సంపల్లి గ్రామంలో ఆదివారం సివిల్స్ ర్యాంకర్ కోల అర్పితకు ఆత్మీయ అభినందన సభ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కోల అర్పిత మాట్లాడుతూ.. భవిష్యత్తులో నర్సంపల్లి గ్రామ అభివృద్ధికి కృషి చేస్తానని పేర్కొన్నారు. గ్రామంలో పాఠశాల నిర్మాణానికి తన తాత కృషి చేయగా, తండ్రి పాఠశాల వసతులకు కృషి చేసినట్లు పేర్కొన్నారు. విద్యార్థులు చదువుపై దృష్టి పెట్టాలని అర్పిత సూచించారు. ఎస్సీ, ఎస్టీ ఓబీసీ స్టూడెంట్ అసోసియేషన్ అధ్యక్షుడు నరసింహనాయక్, మాజీ సర్పంచ్ కత్తుల సత్యనారాయణ, అమర్‌సింగ్, జింక మల్లేశం, చింతల రాములు, బుక్య పాండు, భుఖ్య శేఖర్ నాయక్, బిక్కు, బాల్ సింగ్ తదితరులు పాల్గొని సన్మానించారు.

ప్రభుత్వాసుపత్రి కార్మికుల వెతలు పట్టవా?

సంగారెడ్డి రూరల్, ఏప్రిల్ 28: ప్రభుత్వాసుపత్రి కార్మికుల వెతలు అధికారులకు పట్టవా అని మెడికల్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి యాదగిరి ప్రశ్నించారు. సంగారెడ్డిలోని సుందరయ్య భవన్‌లో ఆదివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో శానిటేషన్, పేషెంట్ కేర్, సెక్యూరిటీ గార్డు, కార్మికులకు రెండు నెలలుగా వేతనాలు ఇవ్వకుండా నిర్లక్ష్యం వహిస్తున్నారన్నారు. కార్మికుల వేతనాలకు సంబంధించి బడ్జెట్ విడుదల చేసినా కాంట్రాక్టర్ కార్మికులకు వేతనాలు ఇవ్వకుండా నిర్లక్ష్యం వహించడంలో ఆంతర్యమేమిటని ప్రశ్నించారు. వెంటనే కార్మికులందరికీ బకాయి వేతనాలు చెల్లించాలని, జీతాలు ఇవ్వకుండా నిర్లక్ష్యం వహిస్తున్న కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.



మాట్లాడుతున్న మెడికల్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి యాదగిరి

ప్రమాదకరంగా మూలమలుపులు

● కనిపించని సూచిక బోర్డులు

● ప్రమాదాల బారిన పడుతున్న వాహనదారులు

బెజ్జంకి, ఏప్రిల్ 28: గ్రామాల్లో వేసిన అంతర్గత రోడ్లలోని మూలమలుపులు ప్రమాదకరంగా మారుతున్నాయి. అంతర్గత రోడ్లను వేసే సమయంలో సంబంధితశాఖ అధికారులు ఒక ప్రణాళిక మేరకు రోడ్లను వేయకపోవడంతో, మూలమలుపుల సంఖ్య అవసరాని కంటే రెట్టింపయింది. ఆయా గ్రామాల పరిధిలోని మూలమలుపుల వద్ద సంబంధితశాఖ అధికారులు కనీసం సూచిక బోర్డులను కూడా ఏర్పాటు చేయలేదు. దీంతో వాహనదారులు తరచూ ప్రమాదాల బారినపడి ప్రాణాలను సైతం కోల్పోయిన సందర్భాలు ఉన్నాయి.

సూచిక బోర్డులు లేక ప్రమాదాలు

బెజ్జంకి మండలంలోని గుగ్గిళ్ళ, కల్లేపల్లి, గుండారం, తోటపల్లి, వీరాపూర్, గాగిల్లాపూర్, పోతారం, బేగంపేట, దాచారం, చిలాపూర్ గ్రామాల్లోని అంతర్గత రోడ్ల మూలమలుపులతో ప్రమాదకరంగా ఉన్నాయి. మండలంలోని ఇతర గ్రామాల్లోనూ ఇదే దుస్థితి నెలకొన్నది. మండల పరిధిలోని రేగులపల్లి నుంచి దేవక్కపల్లి వరకు ఉన్న రాజీవ్ రహదారిపై ప్రమాదకర మూలమలుపులు ఉన్నాయి. ప్రధానంగా బెజ్జంకి క్రాసింగ్ గాగిల్లాపూర్, తోటపల్లి, దేవక్కపల్లి కూడళ్ల వద్ద వాహనదారులు తరచూ ప్రమాదాల బారినపడుతున్నారు. ఇటీవల తోటపల్లి, గాగిల్లాపూర్, రాజీవ్ రహదారి కూడళ్ల వద్ద ప్రమాదాలు చోటుచేసుకున్నాయి.



గాగిల్లాపూర్ వెళ్లే అంతర్గత రోడ్డులో ప్రమాదకరంగా ఉన్న మూలమలుపు

ప్రమాదాలకు నిలయంగా..

గుగ్గిళ్ళ గాగిల్లాపూర్, గుండారం, వీరాపూర్ గ్రామాల్లోని అంతర్గత మూలమలుపుల వద్ద ఎదురెదురుగా వాహనాలు ఢీకొని అనేకమంది ఆస్పత్రుల పాలయ్యారు. బెజ్జంకి నుంచి గుండారం వెళ్లే దారిలో మూలమలుపు వద్ద వాహనం అదుపుతప్పి బెజ్జంకి గ్రామానికి చెందిన యువకుడు మృతి చెందాడు. రోడ్డుకు ఇరువైపులా పెరిగిన చెట్లను, ముళ్ల పొదలను తొలగించకపోవడంతో ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించక ప్రమాదాలు జరుగుతున్నాయి. ఇప్పటికైనా సంబంధితశాఖ అధికారులు స్పందించి ప్రమాదకర మూలమలుపుల వద్ద సూచిక బోర్డులను ఏర్పాటు చేయాలని ప్రజలు, వాహనదారులు కోరుతున్నారు.



గుండారం వెళ్లే రోడ్డు మూలమలుపు వద్ద వాహనం అదుపుతప్పి మృతి చెందిన యువకుడు(ఫైల్)

సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలి



అంతర్గత రోడ్ల మూలమలుపుల వద్ద సంబంధిత అధికారులు సూచిక బోర్డులను ఏర్పాటు చేయాలి. రాత్రి వేళల్లో మూలమలుపుల వద్ద సూచికబోర్డులు లేకపోవడంతో ప్రమాదాల బారిన పడుతున్నారు. ఇటీవల నా మిత్రుడు మూలమలుపు వద్ద వాహనం అదుపుతప్పి మృతి చెందాడు. అధికారులు తగు చర్యలు చేపట్టాలి.

- బొమ్మిడి సాయి, వాహనదారుడు